క్లుప్తంగా

పేదలకు అన్నదానం



సత్తెనపల్లి: భరత మాత అన్నప్రసాద వితరణ పథకంలో భాగంగా పట్టణంలో ప్రముఖ వస్త్ర దుకాణం సౌందర్య సిల్క్స్ యజమాని, ఆర్య సంఘం పెద్దల కమిటీ సభ్యుడు భవిరిశెట్టి వెంకట సుబ్రహ్మణ్యం ఆర్థికసాయంతో 121 మందికి గురువారం అన్నదానం చేశారు. పట్టణంలోని రంగా కాలనీ 16,17వ లైన్ల మధ్యలో ఆ ప్రాంత వాసులు జంపని శ్రీహరి, తాడిబోయిన రామారావు అక్కడ ఉన్న కొందరు యువకులు సేవలు అందించారు. దాతకు, వారి కుటుంబ సభ్యులకు, సేవలు అందించిన ఆ ప్రాంత యువకులకు పథకం రూపకర్త శ్రీనివాసరావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గాయత్రీ మాత ఆవిర్భావ దినోత్సవం



సత్తెనపల్లి: పట్టణంలోని స్టేట్ బ్యాంక్ రోడ్డులో గల ఫిరోజీ ఋషీంద్రుల మఠంలోని పంచముఖీ వేద గాయత్రీ అమ్మవారి ఆలయంలో గురువారం ఆవిర్భావ దినోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అచ్చంపేట రోడ్డులోని శివాలయం నుంచి అమ్మవారికి పసుపుకుంకుమ, పూల కావిడిలు, శ్రీ లక్ష్మీనరసింహస్వామికి పానకం కావిడిలతో ఊరేగింపు జరిపారు. అనంతరం మఠంలో గాయత్రీ మాతకు అన్నాభిషేకంతో పాటు హోమం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ



బొల్లవరం(ముప్పాళ్ల): మండలంలోని బొల్లవరం అడ్డరోడ్డు వద్ద హోంగార్డు సుభాని ఏర్పాటు చేసిన చలివేంద్రంలో గురువారం మజ్జిగ పంపిణీ చేశారు. దాతల సాయంతో పాటు సొంత నిధులతో గత 20 ఏళ్లగా ముప్పాళ్లకు చెందిన హోంగార్డు సుభాని చలివేంద్రం నిర్వహిస్తున్నాడు. దమ్మాలపాడు గ్రామానికి చెందిన రుద్రజడ లక్ష్మయ్య కుమారుడు పుట్టినరోజు సందర్భంగా మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో వెంకట్రావు, సుభాని పాల్గొన్నారు.

సీపీఎం నాయకురాలు పద్మావతికి ఘన నివాళి



పెదకూరపాడు: నిజాయతీ, నిబద్ధత, విలువలతో కూడిన మానవతామూర్తి మునగోటి పద్మావతి మృతి పార్టీకి తీరని లోటని రాష్ట్ర సీపీఐ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని 75 తాళ్లూరులో గురువారం ఏర్పాటు చేసిన పద్మావతి సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. సభకు ఏపీ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ అధ్యక్షత వహించారు. ముందుగా పద్మావతి చిత్రపటానికి పలువురు వామపక్ష నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ నాయకులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



అచ్చంపేట: అరవై మందితో వస్తున్న లారీ ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయే క్రమంలో రోడ్డు పక్కనే ఉన్న కందకంలోకి దూసుకు పోయింది. కొద్దిమందికి గాయాలు మినహా మిగిలిన వారంతా సురక్షితంగా బయటపడిన ఘటన మండలంలోని ఓర్వకల్లులో గురువారం చోటు చేసుకుంది. అమరావతికి చెందిన రామిశెట్టి వెంకటేశ్వరరావు బంధువులతో అమరావతి నుంచి మాదిపాడు పంచాయతీ పరిధిలోని సత్తెమతల్లి దేవాలయానికి మొక్కుబడులు తీర్చుకునేందుకు లారీలో బయలుదేరాడు. ఓర్వకల్లు వద్దకు చేరుకునే సరిగా ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించబోయి రోడ్డు పక్కనే ఉన్న కందకంలోకి లారీ దూసుకు పోయింది. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో కొద్దిమందికి స్వల్ప గాయాలు కాగా మిగిలినవారంతా సురక్షితంగా బయటపడ్డారు. అయిదుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని అచ్చంపేట వైద్యశాలకు తరలించారు. మరో 10మందికి స్వల్ప గాయాలయ్యాయి.

కడుపు నింపని ఉపాధి

రెండు నెలలుగా వేతనాలు అందక కూలీల అవస్థలు

- మండలంలో 3,752 మంది కూలీలు
- రు. 25 లక్షల దాకా బకాయిలు
- కేంద్ర ప్రభుత్వం నుంచి విడుదల కాని నిధులు



వ్యవసాయ కార్మిక సంఘం నాయకులకు సమస్య తెలుపుతున్న పారుపల్లి గ్రామ ఉపాధి కూలీలు (ఫైల్)

క్రోసూరు: నెలలు తరబడి వేతనాలు మంజూరు కాకపోవడంతో ఉపాధి కూలీలు అవస్థలు పడుతున్నారు. కుటుంబ ఆర్థిక అవసరాలు కోసం అప్పులు చేస్తున్నారు. కూలీలకు ఆధార్ ద్వారా కేంద్ర ప్రభుత్వం ద్వారా చెల్లింపులు జరుగుతున్నాయి. మండలంలోని అన్ని గ్రామాల్లో 3,752 మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. గత రెండు నెలలుగా వీరికి వేతనాలు అందడం లేదు. మండలంలో రూ. 25 లక్షల దాకా బకాయిలు ఉన్నాయి. ఇటీవల పలు గ్రామాల్లో పనులను పరిశీలన చేయడానికి వెళ్లిన వ్యవసాయ కార్మిక సంఘం నాయకుల ముందు కూలీలు గోడును వెళ్ల బోసుకున్నారు. రెండు నెలుగా వేతనాల ఇవ్వడం లేదని వాపోయారు. కుటుంబ ఆర్థిక అవసరాల కోసం ప్రైవేటు సంస్థల వద్ద తీసుకున్న రుణాలను చెల్లించలేక పోతున్నామని వాపోయారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక కూలి పనులకు వస్తే సరిగా వేతనాలు ఇవ్వడం లేదని తెలిపారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఆదాయం చాలక, సకాలంలో వేతనాలు అందక ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు.

కనీస సౌకర్యాలు కరువు

గతంలో పనులు చేసే ప్రాంతాల్లో మజ్జిగ, మంచి నీరు, పలుగు, పారా, అలవెన్సు ఇచ్చేవారు. ఇప్పుడు వాటిని ఆపేశారు. మండుటెండలో కూలీలంతా గుక్కెడు నీటి కోసం అల్లాడుతున్నారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉపాధి హామీ పథకానికి తూట్లు పొడిచింది. పథకాన్ని నీరుగారుస్తూ నిధులు తగ్గించింది. 2021- 22 ఆర్థిక సంవత్సరం నుంచి ఇప్పటి వరకు రూ. 24 వేల కోట్ల చిల్లర కోత విధించింది. కూలీలకు గతంలో ఇచ్చిన వివిధ అలవెన్సులు, సౌకర్యాలు కూడా ఆపేసింది. దీని వల్ల వేతనాలు సకాలంలో అందక ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలో చెల్లింపులు

ఉపాధి కూలీల వేతనాలు ఈ వారంలో పడవచ్చు. బడ్జెట్ మంజూరైందని తెలిసింది. వారి ఖాతాల్లో నగదు జమ అయ్యేసరికి వారం పట్టవచ్చు.

– వెంకటేశ్వరరావు, ఏపీవో, క్రోసూరు

వేతనాలు అందక అవస్థలు



రెండు నెలలుగా వేతనాలు పడటం లేదు. నాకు రూ.12 వేలు దాకా రావాలి. కూలి పనులు తగ్గిపోయాయని ఉపాధి పనులకు వస్తే డబ్బులు సరిగా ఇవ్వడం లేదు. కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి ?

– ఏపూరి వెంకటేశ్వర్లు, ఉయ్యందన, క్రోసూరు మండలం

ఎలా బతకాలి ?



నాకు రెండు నెలల డబ్బులు పడకపోవటంతో కుటుంబం గడవడం లేదు. వ్యవసాయ పనులు కూడా లేవు. కుటుంబ అవసరాల కోసం ఉపాధి పనులకు వస్తే వేతనాలు సరిగా ఇవ్వడం లేదు. పనులు చేయించుకుని, డబ్బులు ఇవ్వకపోతే ఎలా బతకాలి ?

– భీంరెడ్డి శివపార్వతి, క్రోసూరు

కొత్త పీఆర్సీకి పాత దానికి లింకేంటి?

ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.ఎం. సుభాని



సత్తెనపల్లి: 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేయాలని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్ల సంఘాలు కోరుతుంటే పాత పీఆర్సీ బకాయిలు అన్నీ ఇచ్చిన తరువాతే వేస్తామని ప్రభుత్వం చెప్పడం సబబుగా లేదని ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఎస్.ఎం. సుభాని అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. 2023 జూలై 1న ఇవ్వాల్సిన 12వ పీఆర్సీ రెండు సంవత్సరాల గడువు పూర్తయినా, ఇంత వరకు దాని ఊసేలేదని తెలిపారు. అసలు దాని గురించి ఆలోచించకుండా బదిలీలు, శిక్షణలు అంటూ నిత్యం ఉద్యోగస్తులందరినీ ఇబ్బంది పెట్టడం దారుణమని ఖండించారు. పాలకుల ఆలోచనలు ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్ శ్రేణులకు ఇబ్బంది కల్గించేవిగా ఉన్నాయని విమర్శించారు. తక్షణమే 12వ పీఆర్సీ ఏర్పాటు చేసి 30 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పాత పీఆర్సీ బకాయిలు, ఎరియర్స్ దశల వారీగా విడుదల చేయాలని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణం

సత్తెనపల్లి: రైతులకు మేలు చేసేది కూటమి ప్రభుత్వం మాత్రమేనని సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకారం మహోత్సవంలో గురువారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. నూతనంగా ఏర్పడిన వ్యవసాయ మార్కెట్ పాలకవర్గ సభ్యులంతా రైతులకు చేదోడువాదోడుగా ఉండాలని తెలిపారు. ముందుగా స్వర్గీయ నందమూరి తారక రామారావు విగ్రహ ఆవిష్కరణ చేసి, మొక్కలు నాటారు.రైతులకు సబ్సిడీపై తైవాన్ స్ప్రేయర్లు, వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేశారు.

చైర్‌పర్సన్‌గా శోభారాణి

సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా కోమటినేని శోభారాణి ప్రమాణ స్వీకారం చేశారు. గతంలోనే ప్రమాణ స్వీకారం నిర్వహించాలని ఆర్భాటంగా తలపెట్టారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి జీఓ విడుదల కాకపోవడంతో దాన్ని అభినందన సభగా అప్పటికప్పుడు మార్చారు. జీవో రాకపోవడంతో ప్రమాణ స్వీకారం వాయిదా వేశారు. గత నెల 26న జీవో 329 విడుదల కావడంతో గురువారం ప్రమాణ స్వీకారం అధికారికంగా నిర్వహించారు. ఏఎంసీ గౌరవ చైర్మన్‌గా ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్‌గా సిరిగిరి ఆదిలక్ష్మి, మెంబర్లుగా బత్తుల సుజాత, బత్తుల వెంకటలక్ష్మి, గొర్రెపాటి సుశీల, గుంటూరు షేక్ బడాఅలీ, గురజాల నాగమల్లేశ్వరి, కానుగుల శివశంకరరావు, మారిశెట్టి రామసైదులు, పాటిబండ్ల పూర్ణచంద్రరావు, పోలూరి యల్లమంద, రాపూరి మాధవి, గనికపూడి సంసోనా, హెచ్‌జీ తులసి, పోతుగంటి రామకోటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి, మార్కెటింగ్ శాఖ ఏడీలు, మార్కెట్ యార్డ్ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

ఎంపీపీ షేక్ జైబున్ బీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ

సత్తెనపల్లి: ప్రజా సమస్యల పరిష్కారానికి మండల స్థాయి అధికారులంతా చొరవ చూపాలని సత్తెనపల్లి ఎంపీపీ ఎలవర్తిపాటి షేక్ జైబున్ బీ చెప్పారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సాధారణ సర్వసభ్య సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం యోగా డే ప్రాధాన్యం, హౌస్ హోల్డ్స్ జియో ట్యాగ్ సర్వే, మిస్సింగ్ సిటిజన్‌లను హౌస్ హోల్డ్‌లకు యాడ్ చేయడం, ఆధార్ సీడింగ్, యోగాంధ్ర రిజిస్ట్రేషన్ వనం మనం వంటి పలు కార్యక్రమాలు చేపట్టిందని తెలిపారు. ప్రజలంతా వీటికి సహకరించాలని ఆమె కోరారు.డీఎల్‌డీఓ రాజగోపాల్ మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని, ప్రతి ఒక్కరూ శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ బండి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సిబ్బంది చర్యలు చేపట్టాలని, మండలం లోని అన్ని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్లను వినియోగంలోకి తీసుకురావాలని తెలిపారు. మండల విస్తరణ అధికారి ఎ. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ ఆధార్ సీడింగ్ వేగవంతం చేయాలని కోరారు. స్వర్ణ పంచాయతీ కింద డేటా అప్డేషన్ ఆవశ్యకత గురించి వివరించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి, ప్రణాళిక గురించి అవగాహన కల్పించారు. వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు ఆయా శాఖల ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలి

నకరికల్లు: ప్రతి విద్యుత్ వినియోగదారుడు పీఎం సూర్యఘర్ పథకాన్ని వినియోగించుకోవాలని, సిబ్బంది కూడా అవగాహన కల్పించాలని పల్నాడు జిల్లా ఎస్ఈ ప్రత్తిపాటి విజయ్‌కుమార్ తెలిపారు. మండలంలోని గుండ్లపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో గురువారం ఆకస్మిక తనిఖీలు చేశారు. రికార్డులు పరిశీలించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చూడాలని, బకాయిలు 100శాతం వసూలు చేయాలని తెలిపారు. రెండవ శనివారం లైన్ మెయింటెనెన్స్ చేయాలని, నూతన సర్వీసులు సత్వరమే మంజూరు చేయాలని సూచించారు. 50శాతం రాయితీతో అదనపులోడును క్రమబద్ధీకరించుకునేందుకు జూన్ 30వ తేదీ వరకు అవకాశం ఉందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఏఈ షేక్ గౌస్, లైన్‌మెన్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

జగ్గాపురంలో ఘనంగా ప్రతిష్ట మహోత్సవం



హోమపూజలు చేస్తున్న దంపతులు



ధ్వజారోహణ చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: జగ్గాపురం గ్రామంలో గురువారం నిర్వహించిన దేవతా విగ్రహాల ప్రతిష్ట మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. బీసీ కాలనీ సమీపంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో సిద్ధివినాయకుడు, సమీపంలో భారీ అభయాంజనేయస్వామి విగ్రహాలు, ఊరిమధ్యలో సీతలాంబతల్లి (బొడ్డు రాయి) విగ్రహాల ప్రతిష్టలు, ధ్వజారోహణ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరగగా, వేదఘోష నింగిని తాకింది. ఉదయం 8:49 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమానికి గ్రామస్తులే కాకుండా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చారు. కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి దేవస్థాన ప్రధాన అర్చకులు కొండకావూరి అయ్యప్ప గురుకుల్, సీతారామ ప్రసాదశర్మ మార్గదర్శనంలో, ఆలయ అర్చకులు చంద్రశేఖర్‌శర్మ, సాయిసుబ్రహ్మణ్య రాఘవశర్మ పర్యవేక్షణలో హోమాలు, వేదపారాయణం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, తహసీల్దార్ జెట్టి విజయశ్రీ, ఎంపీడీవో వి హేమలతాదేవి, చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బానాయుడు, ఎస్ఐ టి శివరామకృష్ణ పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాన్ని ముద్దన నాగేశ్వరరావు, పోపూరి వెంకటేశ్వర్లు (బుల్లోడు) నేతృత్వంలో గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంకొండ: మండలంలోని పాపాయపాలెం సబ్‌స్టేషన్ పరిధిలో గల వెంకటాయపాలెం ఫీడర్‌కు శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని బెల్లంకొండ ఏఈ పవన్ కుమార్ తెలిపారు. 11 కేవీ లైన్లకు మరమ్మతులు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

పోలీసు సిబ్బందికి అండగా ఉంటా !

అడిషనల్ ఎస్పీ సంతోష్



నరసరావుపేట రూరల్: నిరంతరం ప్రజా రక్షణ కోసం పాటుపడే పోలీసు సిబ్బందికి అండగా ఉంటామని జిల్లా అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) జేవీ సంతోష్ తెలిపారు. జిల్లాకు చెందిన హోంగార్డు టీవీకే బాజీ డిప్యుటేషన్‌పై వైజాగ్ స్టీల్ ప్లాంట్‌లో విధులు నిర్వహిస్తూ గురువారం ఉద్యోగ విరమణ చేశాడు. బాజీని అడిషనల్ ఎస్పీ పూలమాల, శాలువాతో సత్కరించారు. కమ్యూనికేషన్ విభాగంలో పనిచేస్తూ ఈనెల 21వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన జె.చెన్నకు అడిషనల్ ఎస్పీ చేతుల మీదగా రూ.5 లక్షల చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో హోంగార్డు ఆర్ఐ ఎస్. కృష్ణ పాల్గొన్నారు.

మొక్కల పెంపకం అందరి బాధ్యత



బెల్లంకొండలో మొక్కలు నాటుతున్న వైద్యుడు శ్రీనివాస్, ఉపాధి హామీ సిబ్బంది



సత్తెనపల్లి పట్టణంలో మొక్కలు నాటుతున్న ఫ్లోర్‌లీడర్ తురక మేరీ గ్రేస్



నకరికల్లు ఎంపీడీఓ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న సిబ్బంది

బెల్లంకొండ: మొక్కలు నాటడాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని మండల ఆయుర్వేద వైద్యుడు ఆర్. శ్రీనివాస్ తెలిపారు. గురువారం 'ప్రపంచ పర్యావరణ దినోత్సవం' సందర్భంగా మండల కేంద్రంలోని ఆయుర్వేద వైద్యశాలలో ఉపాధి హామీ సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. వైద్యుడు శ్రీనివాస్ మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలు, ఖాళీ ప్రదేశాల్లో ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కోరారు. మానవుని మనుగడ చెట్ల పైనే ఆధారపడి ఉందని పేర్కొన్నారు. అనంతరం మొక్కలు నాటడం, పెంచడంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది రవీంద్ర నాయక్, అబ్దుల్, సుశీల, నాగమణి, యోగా టీచర్లు పాల్గొన్నారు.

ప్రపంచీకరణతో ప్రకృతిని మరువ రాదు

సత్తెనపల్లి: ప్రపంచీకరణలో పర్యావరణాన్ని నిర్లక్ష్యం చేయకూడదని పారా లీగల్ వలంటీర్ షేక్ ఖాజావలి అన్నారు. ప్లాస్టిక్‌తో పర్యావరణ మనుగడకు పెను ప్రమాదం వాటిల్లుతుందని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని చెప్పారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి వి. విజయ్‌కుమార్ రెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని వావిలాల స్మృతి వనంలో పర్యావరణ పరిరక్షణ కోసం గురువారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. పర్యావరణ చట్టాలపైన ఖాజావలి అవగాహన కల్పించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం తదితర విషయాల గురించి అవగాహన కల్పించారు. పారా లీగల్ వలంటీర్ షేక్ ముబారక్ మొక్కలు నాటి పర్యావరణ దినోత్సవ స్ఫూర్తిని చాటారు. కార్యక్రమంలో పార్కు వాకర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పురపాలక సంఘం ఆధ్వర్యంలో....

పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలో గురువారం ర్యాలీ నిర్వహించారు. తాలూకా సెంటర్‌లో మానవ హారం చేపట్టారు. ఈ సందర్భంగా ఫ్లోర్ లీడర్ తురక మేరీ గ్రేస్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది

ముప్పాళ్ల: ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం సిబ్బంది మొక్కలు నాటారు. ఎంపీడీవో పి.రత్నం, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ ఏడుకొండలు, సిబ్బంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద, మండలంలో అన్ని గ్రామాల్లోను మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టినట్లు ఎంపీడీవో తెలిపారు. కార్యక్రమాల్లో సర్పంచులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటికో మొక్క అందరి బాధ్యత

నకరికల్లు: పర్యావరణ హితం కోసం ప్రతి ఒక్కరూ ఇంటికో మొక్క నాటాలని పలుశాఖల అధికారులు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని మండలంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ జి.కాశయ్య ఆధ్వర్యంలో పలు సచివాలయాల్లో, అవార్డు సంస్థ కోఆర్డినేటర్ ఎం.సుధాకర్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్టీ కాలనీలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మానవాళికి జీవనాధారం మొక్కలని వాటిని నాటి, పెంచడం అందరి బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ కె.వి.శివప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు, అవార్డు సంస్థ సిబ్బంది విష్ణు, కోటేశ్వరరావు, నాగరాజు, కోటేశ్వరి పాల్గొన్నారు.

ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటుకునే అవకాశం

అచ్చంపేట: ఉపాధి హామీ పథకం ద్వారా రైతులు పొలం గట్లు, కాలువలు, రోడ్ల వెంట మొక్కలు నాటుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు తెలిపారు. ఉపాధి సిబ్బంది కూడా రైతులకు అవగాహన కల్పించాలని ఆయన చెప్పారు. మండలంలోని పలు గ్రామాల్లో గురువారం ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో రెండు వేల మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ సీహెచ్. వెంకటేశ్వర్లు, ఉపాధి సిబ్బంది, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

రొంపిచర్ల : మండలంలో కర్లకుంట గ్రామంలో గురువారం శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ శ్రీ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామానికి వచ్చిన బంధుమిత్రులతో తిరునాళ్ల వాతావరణం నెలకొంది. విగ్రహ ప్రతిష్ట అనంతరం గ్రామంలో భారీ అన్నదాన నిర్వహించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం



రొంపిచర్ల: మండలంలో సంతగుడిపాడు, రొంపిచర్ల శాఖా గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు గురువారంతో ముగిశాయి. సంతగుడిపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులచే పుస్తక పఠనం, ధ్యానం చేయించటం లాంటి కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు ఖాళీ సమయంలో సెల్ ఫోన్లు చూడకుండా పుస్తకాలు చదవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. పుస్తక పఠనం వల్ల క్రమశిక్షణతో పాటు విజ్ఞానం వస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి కె.వెంకట్రావు, గ్రామపెద్దలు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం గ్రామంలో విద్యుత్ షాక్‌కు గురై మహిళ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రావూరి చెంచమ్మ (45) పలువురి ఇళ్లలో పనులు చేసుకుంటూ జీవిస్తుంది. కుమార్తె కుటుంబం అమీన్‌సాహెబ్‌పాలెంలో నివసిస్తుండటంతో వారితో కలిసి ఉంటోంది. గురువారం ఉదయం ఓ ఇంట్లో పనులు చేసేందుకు వెళ్ళింది. నీళ్ల చిమ్మే క్రమంలో వేలాడుతున్న కరెంటు వైరుకు తగిలి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు నమోదు చేసుకున్నారు.

వరకట్న వేధింపులపై కేసు

వరకట్నం వేధింపులపై నాదెండ్ల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై జి పుల్లారావు తెలిపిన వివరాల మేరకు.. చందవరం గ్రామానికి చెందిన స్వర్ణలతతో బాపట్ల జిల్లా చుండూరు మండలం మున్నంగివారిపాలెం గ్రామానికి చెందిన హేమంత శివకోటిరెడ్డితో వివాహమైంది. కొద్దిరోజులకే భర్త, అత్తమామలు కలిసి అధికకట్నం తెమ్మంటూ ఒత్తిడి చేసి శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదు చేసింది.